

నూరేళ్ళ తెలుగు కథకు
నవ్య నీరాజనం
నూరేళ్ళ తెలుగు కథకు

# తెలుగు కథకు ఇది స్వర్ణయుగం

**- నగ్నముని**

ఆధునిక తెలుగు సాహిత్యంలో కథను, కవితను ఏకకాలంలో చేపట్టి నిర్వహించిన వారిని వేళ్ళ మీద లెక్కపెట్టవచ్చు. గురజాడ, శ్రీశ్రీ, పాలగుమ్మి పద్మరాజు, బాలగంగాధర తిలక్, నగ్నముని మొదలైనవారు.. ఇందులో నగ్నమునిలో కొన్ని ప్రత్యేకతలున్నాయి..నగ్నముని ప్రవచిత సంప్రదాయాలకు వ్యతిరేకి. శిల్పం, రూపం, విషయం, దృక్పథం గమనిస్తూ.. వీటికి అతీతంగా సమాంతర, ప్రత్యామ్నాయ మార్గం కొరకు అన్వేషించే ఉద్యమ కవి.. రచయిత!!

**ఊరు: చిలకలపూడి..**

ఓ మూడేళ్ల చిన్న పిల్లవాడు ఒక పెద్ద రాయి కోసం వెతుక్కుంటున్నాడు. రాయి ఎందుకో తెలుసా? అందీ అందని సైకిలు ఎక్కి బందరు వెళ్లటానికి. అక్కడ పుస్తకాల షాపులో చందమామను కొనుక్కోవటానికి..

**ఊరు: మద్రాసు**

ఆ చిలకలపూడి కుర్రాడే మద్రాసు వచ్చాడు. తెలుగు సినిమాను ఓ మలుపు తిప్పిన 'మరో చరిత్ర' సినిమాకు కథను అందించాడు.

ప్రముఖ రచయిత, కవి నగ్నముని జీవితంలో చాలా మందికి తెలియని కోణాలు ఇవి. దిగంబర కవితోద్యమ సారధిగా తెలుగు సాహిత్యంలో పెను సంచలనం సృష్టించిన 'నగ్నముని' అసలు పేరు మానేపల్లి హృషి కేశవరావు. పుట్టింది తెనాలిలో. పెరిగింది బందరులో. నగ్నముని రాసిన 'విలోమ కథలు' ఎమర్జెన్సీ కాలంలో తెలుగు సాహితీ ప్రపంచంలో కొత్త వేడిని పుట్టించాయి. తెలుగులో రాజకీయ విలువలకు సంబంధించి కొత్త పోకడను పాఠకులకు రుచి చూపించాయి. తెలుగులో వాడి వేడి ఉన్న కథకుడిగా ప్రసిద్ధి చెందిన నగ్నముని కథా రచనలో అనేక కొత్త ప్రయోగాలు చేశారు. ఆయనతో భేటీ ఈ వారం ప్రత్యేకం..

**ప్రశ్న:** మీ ఈ యాభై ఏళ్ల ప్రస్థానంలో అనేక ఉద్యమాలు చూశారు. మారిన తరాలకు సాక్షిగా నిలిచారు. వీటన్నింటిని మదింపు చేసుకుంటే ప్రస్తుతం మన సాహిత్యం ఎలా ఉందని మీరు భావిస్తున్నారు?

**జవాబు:** ఇది ఒక స్వర్ణయుగం. నా దృష్టిలో చదివేవాళ్లు తగ్గలేదు. రాసే వారి సంఖ్య పెరిగింది. కథల్లో గాఢత పెరిగింది. కథకుల్లో సమాజాన్ని పరిశీలించే శక్తి పెరిగింది. ఇదంతా కవితల్లోను, కథల్లోను ప్రతిఫలిస్తోంది. అంతే కాకుండా ఒకప్పుడు కథ మధ్యతరగతి వారికే పరిమితమయింది. ప్రస్తుతం కథ కింది వర్గాల వారి గురించి కూడా చెబుతోంది. ఒక్క మాటలో చెప్పాలంటే- తెలుగు కథకు ఇది స్వర్ణయుగం. అయితే రచయితల సాహిత్యాన్ని డిస్ట్రిబ్యూట్ చేసే సంస్థలు, ఏజన్సీలు లేవు. అదే ప్రధానమైన సమస్య.

**ప్రశ్న:** నేటి కథ కింది వర్గాలను గురించి కూడా చెబుతోంది అంటున్నారు కదా... కొంచెం వివరిస్తారా?

**జవాబు:** గతంలో మధ్యతరగతికి సంబంధించిన కథలు మాత్రమే వచ్చేవి. అందులో వారి మనస్తత్వాలు, వారి ఆలోచనా ధోరణి ఇతివృత్తాలుగా ఉండేవి. కల్పన హెచ్చు మోతాదులో ఉండేది. సమస్యలను స్పృశించేవారు కాదు. ఇప్పుడు పరిస్థితి మారింది. బతుకును పట్టించుకొనే కథకులు అనేక మంది వచ్చారు. ఉదాహరణకు ఒక జాలరినే తీసుకుందాం. వారి భాష, బతుకు పోరాటం, వృత్తిలో వచ్చే ఇబ్బందులు...ఇవన్నీ ఇప్పుడు కథల్లో వస్తున్నాయి.

**ప్రశ్న:** మీరు మంచి సాహిత్యాన్ని పాఠకుడి దగ్గరకు తీసుకుని వెళ్లే ఏజన్సీలు లేవన్నారు.. ఇదే ప్రధాన సమస్య అయితే దీనిని ఎలా పరిష్కరించాలి?

**జవాబు:** ఎలా అంటే...కేరళలో రచయితల సహకార సంఘాలు ఉన్నాయి. వారు రచనలు ప్రచురిస్తారు. దురదృష్టవశాత్తు మన దగ్గర అలాంటి పరిస్థితి లేదు. అలాగే ఎక్కడైతే పాఠకులకు కొనగలిగే శక్తి ఉందో.. అక్కడ పుస్తకాలు అందుబాటులో ఉండటం లేదు. ఉదాహరణకు ఢిల్లీలో తెలుగు పుస్తకాల బ్రాంచ్‌లు ఎన్ని ఉన్నాయి. చెన్నై, ముంబాయి, ఢిల్లీల నుంచి విదేశాలకు వెళ్లే తెలుగువారికి అవసరమైన పుస్తకాలు అందించే షాపులు ఎన్ని ఉన్నాయి? ఎన్నారైలు పుస్తకాలు కొనగలరు. వాళ్ల చేతుల్లో డాలర్లు ఉన్నాయి. కొనే శక్తి ఉంది. వారికి పుస్తకాలు అమ్మలేకపోతున్నాం.

**ప్రశ్న:** పాఠకుణ్ణి ఆకర్షించి...పాఠకుని చేత కొని




# కవిగారు - కవిగారి అబ్బాయి...

* నగ్నముని పూర్వీకులు విజయనగరం జిల్లాకు చెందినవారు. ఆ తర్వాత తెనాలికి తరలి వచ్చారు. నగ్నముని తండ్రి పేరు మానేపల్లి సంగమేశ్వరరావు. తల్లి పేరు లక్ష్మీ కాంతమ్మ. తండ్రి అనేక గేయాలు, పద్యాలు రాశారు. ఆయనకు స్వాతంత్ర్యం మీద తపన, గాంధీగారిపై ఆరాధన ఎక్కువ. గాంధీజీ స్మృతిలో పరంజ్యోతి అనే పద్య గ్రంథాన్ని కూడా వెలువరించారు. ఆయన అసలు పేరు ఎక్కువ మందికి తెలియదు. అందరూ 'కవిగారు' అని పిలుస్తూ ఉండేవారు. నగ్నమునిని 'కవిగారబ్బాయి' అని పిలిచేవారు. చిన్నప్పటి నుంచి తండ్రి ప్రభావం నగ్నమునిపై చాలా ఉంది.

* ఒకప్పుడు తెనాలిని 'ఆంధ్రా పారిస్' అని పిలిచేవారు. ఆ ప్రాంతంలో కులమతాలకు అతీతమైన లౌకిక జన విధానం ఉండేది. దీని ప్రభావం కూడా నగ్నమునిపై పడింది. చిన్నప్పుడు నగ్నముని ఇంటికి హరికథా భాగవతులు, తరచూ వచ్చేవాళ్లు. సంగమేశ్వరావుగారి చేత పద్యాలు, గేయాలు రాయించుకొనేవారు.

* కథలు రాయటం కంటే, చదవటం చిన్నప్పటి నుంచి నగ్నమునికి అలవాటు. మూడో తరగతిలో ఉండగానే చందమామ, బాల, బాబు వంటి పత్రికలు చదివేవారు. ఐదో తరగతిలో ఉండగానే 'కోకిల' అనే రాత పత్రి

## నచ్చినవి

| | |
|---|---|
| కథకుడు | : చలం |
| కవి | : శ్రీశ్రీ |
| కథ | : నా గురించి కథ రాయవూ (బుచ్చిబాబు) |
| నవల | : సిద్ధార్థ (జర్మన్ అనువాద నవల) |
| పాట | : ఓహోహో పావురమా (స్వర్గసీమ) |
| గాయని | : టి.జి. కమల |
| గాయకుడు | : ఎమ్మెస్ రామారావు |
| సినిమా | : అపరిచితుడు |
| డైరెక్టర్ | : కె.వి. రెడ్డి |
| హీరో | : నాగయ్య |
| హీరోయిన్ | : భానుమతి |
| వంట | : ఆవకాయ, పప్పు |
| నచ్చిన వ్యక్తి | : మన దొంగ వ్యవస్థల్ని ప్రతిఘటించే ప్రతి వ్యక్తి |


కుటుంబ సభ్యులతో...

పించుకునే శక్తి మంచి రచనకు ఉంటుంది...పాఠకులు కొనడం లేదంటే అది మంచి రచన కాదేమో! మీ ఉద్దేశం?

**జవాబు:** నేను ఈ సమస్యను వేరే కోణం నుంచి చూస్తున్నాను. మంచి రచనా? కాదా? అనే విషయాన్ని పక్కన పెడితే ప్రస్తుతం చాలా మంది పాఠకులు తమకు ఏది అవసరమవుతుందో దానిని మాత్రమే చదువుతున్నారు. ఉదాహరణకు చాలా మంది వ్యక్తిత్వ వికాసం అవసరం ఉందని భావిస్తున్నారు. అందువల్ల ఆ సబ్జెక్ట్ గురించి రాసిన పుస్తకాలే చదువుతున్నారు.

**ప్రశ్న:** కథ-కవిత...ఈ రెండింటిలో ఏది రాయటం కష్టం?

**జవాబు:** రెండింటిలోను కష్టం ఉంది. కథ రాయటానికి జీవితం బాగా తెలియాలి. కవిత్వానికి భాష మీద గట్టి పట్టుండాలి.

**ప్రశ్న:** కవులు-కథకులు...ఈ ఇద్దరి మధ్య ఏదైనా తేడా ఉందని మీరు భావిస్తున్నారా?

**జవాబు:** ఒకప్పుడు కవులు వేరు. కథకులు వేరు. వచన కవిత్వం బలంగా ప్రవేశించిన తర్వాత కథకూ-కవిత్వానికి మధ్య ఉన్న అంతరం చాలా వరకూ చెరిగిపోయింది. కొందరు కవులు గొప్ప కథలు కూడా రాశారు. ఉదాహరణకు గురజాడ, శ్రీశ్రీ, పాలగుమ్మి పద్మరాజు, తిలక్.. ఆ తర్వాత నేను. ఇక వర్తమానంలో కొందరు రచయితలు ప్రయత్నిస్తున్నారు.

**ప్రశ్న:** ఓ కథ లేదా కవిత రాసినప్పుడు ప్రసవ వేదన పడతాడంటారు.. ఒక కవిత లేదా కథ రాసినప్పుడు మీ ఫీలింగ్స్ ఎలా ఉంటాయి?

**జవాబు:** నాకూ మిగిలిన వారికి తేడా ఉంది. నాకు మొదటి నుంచి చదవటం మీద ఉన్న ఆసక్తి రాయటం మీద లేదు. ఎవరైనా మిత్రులు ఒత్తిడి చేసినప్పుడు మాత్రమే నేను రాసేవాడిని. అందువల్ల నాకు ప్రసవవేదన కన్నా.. మిత్రులు నొచ్చుకోకుండా ఉండాలనే ఆలోచనే ఎక్కువగా ఉండేది.

**ప్రశ్న:** మీ జీవితంలో మరచిపోలేని సంఘటన?

**జవాబు:** దాదాపు పదేళ్ల క్రితం తీవ్రమైన జబ్బు చేసింది. కదలలేని స్థితికి వచ్చేశాను. జ్ఞాపకశక్తి పూర్తిగా పోయింది. ఏ విషయమూ గుర్తు లేని స్థితి. జబ్బు చేసిన తర్వాత మా శ్రీమతిని చూసి 'మీ పేరు ఏమిటి?' అని అడిగానట..ఆ తర్వాత క్రమంగా కోలుకున్నా. ఇది నా జీవితంలో ఒక ముఖ్యమైన, మరిచిపోలేని సంఘటన . ఆ సమయంలో మిత్రులు చూపించిన ఆదరణ మరిచిపోలేనిది.

– సి.వి.ఎల్.ఎన్.ప్రసాద్

కకు సంపాదకుడయ్యారు.

### సాహిత్య సాంగత్యం

మిత్రుల ఒత్తిడిపై నగ్నముని కథలు, కవితలు రాయటం మొదలు పెట్టారు. ఇవి భారతి, స్వతంత్ర, ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ, కృష్ణా పత్రిక, గోల్కొండ పత్రిక మొదలైన వాటిలో ప్రచురితమయ్యాయి. ఆకాశవాణిలో కూడా ప్రసారమయ్యాయి. *1972*లో 'నగ్నముని కథలు' అనే సంకలనం వెలువడింది. తెలుగులో ఆధునిక తొలి మహాకావ్యంగా భావించే 'కొయ్యగుర్రం'తో నగ్నమునికి తెలుగు సాహిత్యంలో సముచిత స్థానం లభించింది. వచన కవితను కొయ్యగుర్రం మహాకావ్యస్థాయికి తీసుకువెళ్లిందని విమర్శకుల అభిప్రాయం.

### సాహితీ విప్లవ ప్రేరణ


స్వాతంత్ర్యం వచ్చింది. కాని మహాత్ముడు కలలు కన్న స్వరాజ్యం రాలేదు. సమాజంలోను, రాజ్యాంగ వ్యవస్థలన్నింటిలోను రాజకీయనాయకులు అవినీతిని వ్యాపింప చేశారనే క్రోధంతో ఆరంభించినదే దిగంబర కవితోద్యమం. ఈ సమయంలోనే విరసం వ్యవస్థాపక సభ్యుడిగా కూడా నగ్నముని ఉన్నారు. ఎమర్జెన్సీ సమయంలో తిరగబడ్డారు. అరెస్ట్ అయ్యారు. ఈ కాలంలో రాసినవే 'విలోమ కథలు'. మనం అనులోమంగా వెళ్లటం లేదని.. విలోమంగానే వెళ్తున్నామని తెలిపే కథలు. ఈ కథల్లో ప్రయోగం- ప్రయోజనం రెండూ కనిపిస్తాయి. దిగజారిన రాజకీయ విలువల గురించి దీనిలో నిశితమైన పరిశీలనా, విమర్శ ఉన్నాయి.

*

**నాకు నచ్చిన నా కథ**

# సిమెంటు సంతతి

-నగ్నముని



లోకంలో వయసొచ్చిన అందరాడ పిల్లలకి మల్లేనే ఆ పిల్ల కూడా మొదట్లో మంచుతో నేసిన జలతారు ముసుగు మోహమ్మీదికి లాక్కుని, రేకువిడడానిక్కూడా సిగ్గుపడే మల్లెమొగ్గలా వుండేది. కాళ్ళలో లేళ్ళు గంతులేసేవి. కనురెప్పల్ని కలలు కమ్ముకునేవి. కారు మేఘాల మదపు టేనుగులు గుంపుగా జుట్టులోకి కుమ్ముకొచ్చేవి. కాళ్ళూ, చేతులూ, ప్రతి అవయవం యవ్వన పరిమళపు సెలయేళ్ళుగా తుళ్ళిపడేవి. పెదవుల మీద వెన్నెల ఒలికి, పలువరుసని పలకరించి, ఒంటిలో యింకి పోయేది.

నడిస్తే నడుస్తున్న హారతిలా వుండేది.

ఆ పిల్ల తండ్రి కాళ్ళూ, చేతులూ మెదడూ ఎప్పుడూ పన్జేస్తుండేవి. అర్ధరాత్రుళ్ళు భగ్గుమని చివరి మంట మండే లాంతర్లాంటి కళ్లతో యింటికి చేరేవాడు. కుష్టు వ్యాధి వ్యాపించిన వాడిలాగా దరిద్రంతో తీసుకుంటుండేవాడు. దరిద్రం క్రమంగా అతని అన్ని అయవవాల్ని తినేస్తోంది. నెమ్మదిగా నెమ్మదిగా యింటిగోడలకి, యింట్లోని యితర వస్తువులకి, మనుషులకి వ్యాపిస్తోంది ఆ వ్యాధి.

తల్లి వంటింటి అలుగుడ్డ. ఎడ తెరిపిలేని దగ్గుగా మారి చింకిచాప మీద ముణగదీసుకునుండేది. అర్ధరాత్రి మసిబారిన లాంతరు కళ్లతో, సగం సగం ఆవయవాల్తో యింటికొచ్చే కట్టెతో కాపరం జేసేది.

వీధిలోని పెంట కుప్పకీ, యింటికి పెద్ద తేడాలేదు. పెంట కుప్పమీద గులాబీ మొక్కలాగా ఆ పిల్ల తనని తాను చూసుకునే లోపలే ఎదిగిపోయింది.

అవయవాలన్నీ అందమైన పువ్వుల్లోకి మారిపోయినై.



కుండీలో పెడతాననీ, మేకలు తినెయ్యకుండా కాపలా కాస్తాననీ, అంటుకట్టి మరిన్ని అందమైన రంగు రంగుల పూలు పూయిస్తానని పుస్తకాల్లోంచి పక్క వీధిలోంచి ఎగిరొచ్చాడో కుర్రవాడు.

వాడి మాటల్లో మత్తుపానీయాలున్నాయ్.

వాడి కళ్ళలో గురి తప్పని పూల బాణాలున్నాయ్.

వాడి నిట్టూర్పుల్లో మధురంగా బంధించే లతలున్నాయ్.

వాడి చొక్కాకీ గలగలలాడే జేబుంది.

వాడి వొంట్లో సలసలకాగే రక్తసరసుంది.

వాడి చేతిలో గుండెల్ని సుతిమెత్తగా తెరిచే రహస్య తాళం చెవి వుంది.

అనుమతివ్వాలో లేదో తేల్చుకోకముందే ఆమె గుండెని తెరిచి దేహమంతా ఆక్రమించుకున్నాడు వాడు. రోజులు అగరొత్తులుగా వెలిగినయ్.

వాగ్దానాల పూసలు దవనపు వాసనలైనై.

సెలవులయి పోయినయ్. వొచ్చినంత వేగంతో తిరిగి దూరపు కాలేజీ పుస్తకాల్లోకి పారిపోయాడు వాడు.

వెళ్ళిపోయేప్పుడు కిటికీలు ముయ్యలేదు. తలుపు దగ్గరికయినా వెయ్యలేదు. కలలు కళ్ళని కమ్మేస్తే గుండెని బార్లా తెరిచి, గాయం చేసి వెళ్ళిపోయాడు.

గుమ్మం దగ్గరే మొక్కగా వుండగానే మాన్నైపోయి, వాడికోసం రెప్పలు పీకేసిన కళ్ళతో వెతికింది ఆ పిల్ల.

ఆ తర్వాత ఆ గుమ్మం దగ్గరికి రకరకాల తాళాల వ్యాపారులొచ్చారు. వాళ్లంతా తాళాల దొంగలే తప్ప గుండె చప్పుడు వినగల్గిన వాళ్ళు కాదు. కొందరు పాత తాళాలకి కొత్త తాళాలు అమ్మే వాళ్ళయితే మరికొందరు కొత్త తాళాల్ని త్వరితంగా తుప్పు తాళాలుగా మార్చేసే వాళ్లే. ఆ ఇనుప వ్యాపారులందరికీ యినప బీరువాలు తెరవగలిగిన తాళాలు కావాలి అంతే.

వాళ్లంతా అనేక జంతువుల్ని వెంట తీసుకొచ్చేవారు. అవి మానవ భాషలో తెగ అరిచేవీ, కరిచేవీ, తండ్రీ కొడుకులు, అన్నదమ్ములు, మామా అల్లుళ్లు, బావమరుదులు రకరకాలైన జంతువులొచ్చేవి.

ఒకడు బొజ్జతో ఖద్దరు వాసన కొడతాడు. మరొకడు కాంట్రాక్టుల వాసన వేస్తాడు. ఒకడు కాసేపు దేహంలోకి వుమ్మేసి బస్సెక్కో రిక్షా ఎక్కో పాపం చేసిన వాళ్లా పారిపోతాడు. మరొకడు రాత్రంతా కాండ్రించి వూసి తెలతెలవారుతుండగా మళ్ళీ మామూలు ముఖం తగిలించుకుని జారుకుంటాడు. అందరి చర్మపు భాషా ఒకటే. ఒక్కడూ గుండె చప్పుడు వినడు.

ఉమ్ముల దారిలో చర్మం బీటలు వారుతోంది. శరీర వృక్షం బెరడు పెళ్లలుగా రాలుతోంది. అయినా ఆశ చావదు. వాడెప్పుడో యీ దారంట వస్తాడు. పశ్చాత్తాప్పడతాడు. మనసులో తిరిగి మరులు పూయిస్తాడు. ఇల్లూ, పిల్లలూ చల్లని సంసారంతో సన్నజాజి పందిరి వేస్తాడు. వాడి కోసం రోడ్డు మీద మొహాలు చూడ్డం, వీలున్నప్పుడల్లా వీధులంట తిరగడం, పార్కులో మూల కూచుని రావడం మానలేదు ఆమె.

ఒకరోజున పార్కులోనే చాలా రాత్రయిపోయింది. రెండ్రోజుల్నుంచీ తిండి లేదు. నీర్సంగా



వుంది. ఇంటికి పోదామని లేచే సరికి వర్షం మొదలయింది. పరిగెత్తుకెళ్ళి పార్కులోనే మూల షెడ్డు లాంటిదుంటే అందులోకి జేరింది. అప్పటికే ఒంటి మీద బట్టలాంటిది తడిసింది. మెరుపుల్తో వాన పెరుగుతోంది. కింద నాపరాయి, పైన రేకులు. జల్లు మీదకి చిందడం లేదు. కాస్త ఫర్వాలేదని ముణగదీసుకుని మూల జేరబడింది. ఎవరూ దరి దాపుల్లో లేరు. దూరపు గుడ్డి లైటు వెల్తురు. వర్షం. తన పక్కనే మెరుపుల్లో చూస్తే ఎవడో ఒకడు పడుకున్నట్లు కనబడింది. గతుక్కుమనిలేచి పరకాయించి చూసింది. మళ్ళీ మెరుపులో చూసినప్పుడు అంత విషాదంలోనూ నవ్వొచ్చింది.

అది ఆ వూరుని ఒకప్పుడు ఏకచ్ఛత్రాధిపత్యంగా ఏలిన ఒక గొప్ప రాజకీయ నాయకుడి విగ్రహం. బతికుండగా ఆయన అనేక పదవులు అలంకరించాడు. చేతికి ఎముకల్లేవన్నారు. శ్రీ మహావిష్ణువే సాక్షాత్తూ యీయన రూపంలో ప్రజా సేవ నిమిత్తం అవతరించాడన్నారు. పేదల పాలిట పెన్నిధి అన్నారు. సంఘసంస్కర్త అన్నారు.

ఒకప్పుడు పార్కు మధ్యన తిన్నెమీద రాజసంగా నుంచుని నీరాజనాలందుకున్నదా విగ్రహం. ఇప్పుడు ప్రత్యర్థులు పదవిలోకొచ్చాక షెడ్డులో పడుంది.

ఆ సిమెంటు విగ్రహాన్నానుకుని గోడకి జేరగిలబడిందామె, ఎప్పుడు పట్టిందో నిద్ర. వర్షం పడుతూనే ఉంది. శరీరం నేలమీద మూలకి ముణగదీసుకుని తుపానులో చెట్టులాగా వాలి పోయింది. కమ్మటి నిద్ర పట్టేసింది.

పాత కల.

నిద్రలోనే వాడితో గడిపిన నాటి కల దుప్పటిగా కప్పుకుంది.

అమాయకపు జంతు మొహంతో వాడొచ్చాడు. తలుపు తట్టాడు.

పశ్చాత్తాపడ్డాడు. క్షమించమన్నాడు

తిరిగి గుండె తాళం తెరిచాడు. బలంగా, బరువుగా మాటల మత్తు వాసనల్తో యింటి నిండా వసంతం నింపాడు. వాడి కౌగిట్లో కళ్ళు మూసింది. ఆవేశంలో కొట్టుకు పోయింది. అలసిపోయి ఒడ్డుకు జేరి పడిపోయింది.

## కథాంతరంగం



నేను రాసిన 'విలోమ కథ'ల్లో నాకు నచ్చిన నా కథ 'సిమెంట్ సంతతి' ఈ కథలో అమాయకత్వం ఉంది. అసహాయతనం ఉంది. చీకటి ఉంది. ఎడతెరిపిలేని వర్షం ఉంది. ఇది ప్రేమించి మోసపోయిన ఓ స్త్రీ కథ. ఆమెకు ప్రేమించడమే తెలుసు! మోసపోయిన సంగతి తెలీదు. తెలియక పారిపోయిన ప్రేమికుని కోసం ఎదురు చూస్తూ కలలు కంటూ ఉంటుంది. కలలు కనడం చాలా ప్రమాదం. ఆ ప్రమాదాన్నే నేనీ కథలో చెప్పాను. ఈ కథలోని కథానాయికలాగే ప్రజలకూ తాము మోసపోతున్నామన్న సంగతి తెలీదు. తెలియక కలల్లో బతుకుతున్నారు. అదలా ఉండగా రాజకీయ నాయకులు శిలా విగ్రహాలు అయినా వారి చెడు చర్యల ప్రభావం ప్రజలపై ఉంటుందని చెప్పడానికి కూడా నేనీ కథ రాశాను.

—నగ్నముని

వర్షం పెద్దదైంది. గులకరాళ్లతో బాదడం మొదలెట్టిందల్లా క్రమంగా ఆకాశంలోని బండరాళ్లని దొర్లిస్తున్నట్టు మారిపోయింది. కసిగా నీటిఖడ్గం గాలిని కోస్తోంది, భూమిని తరుముతోంది. ఎక్కడో పిడుగు పడింది. ఆ పిడుగు ఆమె మూసిన కనురెప్పల మీద పడింది. ఆమె గుండెల్లో పడింది. ఆమె కల మీద పడింది.

ఆమెకి చప్పున మెలకువొచ్చింది. వెల్లకిలా పడున్నదల్లా వెంటనే లేవాలని ప్రయత్నించింది. లేవలేక పోయింది. ఒంట్లో సత్తువనంతా కూడదీసుకుని లేవాలని ప్రయత్నించింది. కానీ, లేవలేక పోయింది. తనమీద ఏదో బరువుగా పడుకునుంది. దుంగలా పడుంది. రాతిబండలా కదలనివ్వకుండా మెదలనివ్వకుండా పడి వుంది. భూమిలోకి అదుముతున్నట్లనిపిస్తున్నది. ఒక్కసారి ఖణేల్మన్న మెరుపులో ఆమెకి తానెక్కడవుందో, తన మీద ఏమి పడివుందో కనబడింది. తన శరీరంలోని అణువుల శక్తినంతటినీ కూడదీసి బలంగా తనపైనున్న ఆ సిమెంటు శరీరాన్ని పక్కకు తోసేసి నిలబడింది. మరో మెరుపులో కిందకి చూసింది.

సిమెంటు విగ్రహం. తనవంకే నవ్వుతూ చూస్తున్న రాజకీయ నాయకుడి విగ్రహం. తిరిగి సిమెంటు చేతుల్లో లాక్కోవడానికి ప్రయత్నిస్తోంది. ఆమె వూడిపోయిన తన చీర ముక్కని ఒంటి చుట్టూ చుట్టుకోడానికి ప్రయత్నిస్తోంది.

తను కలలో జేరింది ఆ విగ్రహం కౌగిట్లోకా! విగ్రహం చేతులు వెకిలిగా నవ్వుతూ ఆమెని తిరిగి పొదువుకోడానికి ముందుకొస్తున్నాయ్. ఆమెకి మతిపోయి, పరుగెత్తుకుంటూ వర్షంలోనే బయటకొచ్చి పడింది. కంగారులో దారి తప్పింది. ఎప్పటికో యింటికి చేరింది.

నెల తప్పింది.

కడుపులో సిమెంటు బలంతో మరో మొక్క దేహం రాళ్ళ మధ్య వేళూనింది. మొక్కని పీకెయ్యలేక పోయింది.

ఆకాశం పొట్ట చిరిగి పేగులు బయట పడ్డట్లు మెరుపులు.

దేహంపై నిరంతరం కురిసే మురికివాన. లోకపు శ్మశానం నిండా కంకాళాల్లా పెరిగిపోతున్న తాళపు చెవులు. ముఖాల్లో అడవి జంతువుల హాహాకారాలు. అయినా, ఆమెలో ఆశ చావలేదు. వాడెప్పుడో వస్తాడు గాయాలు కడుగుతాడు. గుండె దగ్గర తిరిగి ప్రేమ పిల్లనగ్రోవినూదుతాడు.

మరో గులాబీ మొక్క పెంటపోగులో ఎదుగుతోంది. వెయ్యి రేకుల్తో వికసించబోతోంది.

సిమెంటు చేతుల్లోకి, కాళ్ళ కిందకి, ప్రతి మురికి అవయవం కిందకీ జేరి అణిగిపోబోతోంది.

రాజకీయ నాయక జంతువులు బతికి వున్నప్పుడే గాక చచ్చి విగ్రహాలుగా మారి కూడా ప్రజల భవిష్యత్తుని అంధకారబంధురం చేసి తమ సంతతిని పెంచుకుంటూనే వుంటారు.

సృష్టికి కూడా తన సృష్టిని గమనించాలని లేదా!

❋


**చిరునామా:**

నగ్నముని

రవి అపార్ట్‌మెంట్స్, 16-11-1/2,

ఫ్లాట్ నెం. 101, సలీం నగర్, మలక్‌పేట

హైదరాబాద్ - 500 036

సెల్ నెం: 9441081922




## బికినీకి దూరం... త్రిష

దాదాపు తారలందరూ ఎప్పుడో ఒకప్పుడు, ఏదో ఒక సినిమాలో, ఓ సన్నివేశంలో బికినీలో నటించిన వారే. ప్రస్తుతం నటిస్తున్నారు కూడా. ఒకప్పుడు ఐటమ్ గర్ల్స్ మాత్రమే బికినీ డ్రస్‌లు వేసుకునేవారు. ఇప్పుడు దాదాపు హీరోయిన్లు అందరూ బికినీ ధరించడానికి వెనకాడడం లేదు. అయితే ఒక్క హీరోయిన్ మాత్రం బికినీకి దూరం అంటోంది. ఇప్పటికే గుర్తు పట్టే ఉంటారు. ఆ హీరోయిన్ ఎవరో! ఇంకెవరో కాదు...'ఆకాశమంత' ఎత్తుకు ఎదగబోతున్న త్రిష. తెలుగు, తమిళ చిత్రాలలో బిజిబిజీగా ఉన్న త్రిష, బికినీ మీద తన మనసులో మాట చెప్పింది. బికినీలో తప్ప అభిమానులు తనను ఆదరించరు అన్న దురభిప్రాయం తనకు లేదని అంది. పాత్ర పరంగా, సీనుకు అవసరం అయితే బికినీలో నటించడం తప్పు కాకపోయినా దానికి మాత్రం తాను దూరం అంటోంది. బికినీ ధరించకుండానే తను నటించిన సినిమాలు అన్నీ విజయవంతం అయినప్పుడు ఇక దాని జోలికి పోవలసిన అవసరం ఏమిటి? అని ఎదురు ప్రశ్నిస్తోంది.